క్లుప్తంగా

ఘనంగా వెంకన్న కల్యాణోత్సవం


వెంకన్న ఉత్సవమూర్తులకు తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: వెంకటాద్రిపై గురువారం స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. చాతుర్మాస్య పూజల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేతంగా వెంకన్న ఉత్సవమూర్తులను వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా మదర్ చారిటబుల్ ట్రస్ట్ వార్షికోత్సవం


పేదలకు బియ్యం, చీరలు అందిస్తున్న సీఐ రంగనాథం, తదితరులు

సబ్బవరం: మదర్ చారిటబుల్ ట్రస్ట్ 9వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. సబ్బవరంలోని ట్రస్ట్ కార్యాలయంలో సీఐ రంగనాథం ముఖ్యఅతిథిగా పాల్గొని సుమారు 70 మంది పేదలకు చీరలు, దుప్పట్లు, బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వి.సత్య గంగరాజు, వైఎస్సార్ సీపీ నాయకురాలు దెడ్డం పద్మావతి, ట్రస్ట్ డైరెక్టర్లు పి.శ్రీనివాస్, జి.రమేష్, తారకేశ్వరి, మౌనిగ, కృష్ణ, సుశీల పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి



బొద్దపువానిపాలెం చెరువు వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధి కార్మికులు

పరవాడ: ఉపాధి హామీ కార్మికుల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. బొద్దపువానిపాలెం గ్రామంలో చెరువు వద్ద బకాయి వేతనాల కోసం గురువారం ఉపాధి కార్మికులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ 6 వారాల బకాయిలు చెల్లించి, 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూస్తోందని విమర్శించారు. కూలీలకు సామగ్రి కోసం డబ్బులు చెల్లించాలన్నారు. ఉపాధి పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, పార్వతి, రమణమ్మ, జ్యోతి, ధనలక్ష్మి, అప్పారావు, శ్రీను, నాయుడు, రమణ పాల్గొన్నారు.

'బోధన విధానంలో వినూత్న మార్పులు'


పాఠశాలలో ప్లాట్‌ను ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ అప్పలరాజు

పరవాడ: విద్యా రంగంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణల ఫలితంగా బోధన విధానంలో వినూత్న మార్పులు చోటు చేసుకోవడం శుభ పరిణామని పరవాడ మండల వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు అన్నారు. వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో పది ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పందిరి కనకేశ్వరరావు, ఇన్‌చార్జి విక్టోరియా ప్రాన్సిస్, ఎంపీటీసీ సభ్యులు గెడ్డం పుష్పాచంద్రరావు, సర్పంచ్ శివలంక లక్ష్మి, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ పెదపాటి పద్మావతి, పీఏసీఎస్ చైర్మన్ బురద రాజు పాల్గొన్నారు.

త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి


మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి


సమావేశానికి హాజరైన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు

- అధికారులకు ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి ఆదేశం
- పరవాడ మండల సర్వసభ్య సమావేశం

పరవాడ: మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందేలా అధికారులు దృష్టి సారించాలన్నారు. మండల సమావేశాలకు రెవెన్యూ అధికారులు గైర్హాజరు కావడంపై సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. రెవెన్యూ పరమైన సమస్యలు చెప్పుకుందామంటే అధికారులు సమావేశాలకు రాకపోవడం ఏమిటని ప్రశ్నించారు.

సమస్యల ఏకరువు

మండలంలో రహదారులు అధ్వానంగా తయారయ్యాయని, తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని పలు గ్రామాల సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. సర్వసభ్య సమావేశంలో పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పరవాడ–అనకాపల్లి తారు రోడ్డుకు ఇరువైపులా బెర్మ్‌లను పూడ్చకపోవడంతో తరచూ ప్రమాదాలకు దారితీస్తున్నాయని పరవాడ, భర్నికం సర్పంచులు సిరపరపు అప్పలనాయుడు, పెదిశెట్టి పూజాశేఖర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఈ రోడ్డులో పరవాడ సమీపంలో జరిగిన ప్రమాదంలో భర్నికం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మృత్యువాత పడ్డారన్నారు. అలాగే రహదారులకు ఇరువైపులా తుప్పలు తొలగించాలని విన్నవించినా ఫలితం లేదన్నారు. ముత్యాలమ్మపాలెం ముత్యమాంబ ఆలయ సమీపంలో వంతెనను ఆర్ అండ్ బీ అధికారులు అభివృద్ధి చేయాలని మండల కోఆప్షన్ సభ్యుడు మైలపల్లి అప్పన్న కోరారు.

అధ్వానంగా మారిన ఊటగెడ్డ–ఎన్టీపీసీ రహదారికి మరమ్మతులు చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టరుకు ఆదేశాలిచ్చామని ఆర్ అండ్ బీ ఏఈ లలిత కుమారి తెలిపారు. జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు విధిగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవడానికి ముందుకు రావాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షన్ముఖ సూచించారు. పీఎం కిసాన్‌కు 95 శాతం ఈకేవైసీ పూర్తి చేశామని మండల వ్యవసాయాధికారి సిహెచ్.చంద్రావతి చెప్పారు. రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కలపాక శివారు స్వయంభూవరం గ్రామంలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పొలంబడి కార్యక్రమంలో భాగంగా 50 ఎకరాల్లో సేంద్రియ ఎరువుల వినియోగంతో వరి పంటను సాగు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో పరవాడ జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, సర్పంచులు, ఎంపీటీసీ భ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చింతల అగ్రహారంలో యూజీడీ పైపులైన్

- సర్వే చేసిన కమిషనర్ సాయికాంత్ వర్మ, ఎమ్మెల్యే అదీప్‌రాజ్
- పైపులైన్ ఏర్పాటుకు అంగీకరించిన గ్రామస్తులు


గ్రామస్తులతో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: పెందుర్తి మండలం చింతల అగ్రహారంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ గురువారం పర్యటించారు. ఈ ప్రాంతంలో యూజీడీ పైపులైను నిర్మాణం కోసం సర్వే నిర్వహించారు. చింతల అగ్రహారం మీదుగా యూజీడీ పైపులైన్‌ని వెంకటాపురం పంప్ హౌస్ వరకు తీసుకెళ్లేందుకు స్థల పరిశీలన చేసినట్టు ఈ సందర్భంగా కమిషనర్ తెలిపారు. పెందుర్తి, సుజాతనగర్, పాపయ్యరాజుపాలెం, బీఆర్‌టీఎస్ రోడ్డు, చినముషిడివాడ తదితర ప్రాంతాల్లోని మురుగు నీటిని పైపుల ద్వారా వెంకటాపురం పంపింగ్ హౌస్‌కి, అక్కడి నుంచి నరవ మురుగునీటి శుద్ధి కర్మాగారానికి తీసుకెళ్లే మార్గంలో చింతల అగ్రహారం గ్రామం మీదుగా పైపులు వేయాల్సి ఉంది. అయితే ఈ ప్రక్రియ కొంత కాలంగా పెండింగ్‌లో ఉంది. స్థానికుల నుంచి అభ్యంతరాలు రావడంతో ఎమ్మెల్యే, కమిషనర్ వారితో మాట్లాడారు. స్థల సమీకరణ విషయంపై స్థానికులతో ఒప్పందం చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చింతల అగ్రహారం మీదుగా పైపులైన్ వేస్తే ఈ ప్రాంత నివాసితులకు ఎలాంటి నష్టం జరగదని, జన జీవనానికి ఎటువంటి ఆటంకం కలగదని పేర్కొన్నారు. ఇబ్బందైన చోట సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం చేస్తామన్నారు. ప్రజలకు అవసరమైన తాగునీరు సదుపాయం అంచెలంచెలుగా అందిస్తామన్నారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ విశాఖనగరంలో మురుగునీటిని శుద్ధి చేసి పరిశ్రమలకు, మొక్కలకు వినియోగించడం జరుగుతుందన్నారు. చింతల అగ్రహారం రోడ్డు మీదుగా యూజీడీ పైపులైన్ వేయడానికి గ్రామ ప్రజలు ముందుకు వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, జీవీఎంసీ 8వ జోన్ కమిషనర్ మల్లయ్యనాయుడు, పర్యవేక్షక ఇంజినీర్ వినయ్‌కుమార్, కార్యనిర్వాహక ఇంజినీర్లు దిలీప్‌రాజ్, సంతోషి, అధికారులు పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం


వర్షపు నీటిలో మునిగిన ద్విచక్ర వాహనాలు

పరవాడ: మండలంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. సాయంత్రం 3 గంటల ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో కాలువలు, గెడ్డలు పొంగి ప్రవహించాయి. గాలులకు పరవాడ గ్రామం మరిడిమాంబ కల్యాణ మండపం వద్ద కొబ్బరి చెట్టు కూలి కరెంటు తీగలపై పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బొంకుల దిబ్బ, సబ్‌స్టేషన్ వద్ద త్రీ ఫేజ్ విద్యుత్ వైర్లు తెగిపోయాయి. ఈ వైర్లను సరి చేయడానికి విద్యుత్ శాఖ సిబ్బంది చర్యలు చేపట్టారు. అలాగే ఫార్మాసిటీలో పలు లోతట్టు ప్రాంతాలు వర్షపు నీటితో నిండిపోయాయి. ఫార్మాసిటీలో అరబిందో పరిశ్రమ వద్ద లోతట్టు ప్రాంతంలో చేరిన వర్షం నీటిలో కార్మికులు పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలు మునిగిపోయాయి. వాటిని బయటకు తీయడానికి కార్మికులు నానా అవస్థలు పడ్డారు. ఈ వర్షం ఖరీఫ్ పంటలకు బాగా అనుకూలిస్తాయని మండల వ్యవసాయాధికారి సిహెచ్.చంద్రావతి తెలిపారు.

అప్పన్న సన్నిధిలో ప్రముఖులు


కప్పస్తంభానికి మొక్కుకుంటున్న అనిల్‌కుమార్ శ్రీవాత్సవ దంపతులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం అలహాబాద్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి, డెబిట్స్ రికవరీ అపిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్ ఆఫ్ కోల్‌కతా అనిల్‌కుమార్ శ్రీవాత్సవ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని డిప్యూటీ ఈవో సుజాత అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మేనేజర్ రమేష్ పాల్గొన్నారు.

అప్పన్నకు శాస్త్రోక్తంగా ఆర్జిత సేవలు


స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, అధికారులు, భక్తులు


నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేసి, ఉభయదాతలను స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేయించారు. స్వామి సన్నిధిలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహిస్తూ 108 స్వర్ణ పుష్పాలతో అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ సూపరింటిండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కమనీయం.. నిత్య కల్యాణం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఉదయం 9.30 గంటలకు ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను వేయింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, తదితరులు ఈ సేవ నిర్వహించారు.

సాగుకు ముందు నవధాన్యాలు వేసుకోవడం మేలు


ఆదిరెడ్డిపాలెం వ్యవసాయ క్షేత్రంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న హేమసుందర్ తదితరులు

సబ్బవరం: ఖరీఫ్ సీజన్‌లో వరి వేసే ముందు సాగుభూమిలో నవధాన్యాలు వేయడం చాలా మంచిదని ప్రకృతి వ్యవసాయం ఆర్‌టీవో హేమసుందర్ తెలిపారు. మండలంలోని సబ్బవరం శివారు ఆదిరెడ్డిపాలెం గ్రామంలో ఆదిరెడ్డి రమణ అనే రైతుకు చెందిన పొలంలో నవధాన్యాలు, పచ్చిరొట్టపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన పంట వరికి పురుగులు, తెగుళ్లు రానివ్వదని, భూమి నల్లబారి దిగుబడి బాగా వస్తుందని సూచించారు. నవధాన్యాలు వల్ల భూమిలో జీవన వైవిధ్యం, కర్బన శాతం పెరిగి పంటకు కావలిసిన సూక్ష్మ, స్థూల పోషకాలు అందుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జేపీఈ గణేష్, ఎంటీ వెంకటలక్ష్మి, లక్ష్మణరావు, ఐసీఆర్‌పీ పద్మ పాల్గొన్నారు.

12, 13 తేదీల్లో ఏఐటీయూసీ సభలు


సభని విజయవంతం చేయాలని కోరుతున్న సివిల్ సప్లై గొడౌన్ కలాసీలు

సింహాచలం: ఈ నెల 12, 13 తేదీల్లో నగరంలో జరిగే ఏఐటీయూసీ కార్మిక సంఘం 13వ మహా సభలను విజయవంతం చేయాలని పెందుర్తి సివిల్ సప్లై గొడౌన్ కలాసీల సంఘం ప్రతినిధి, ఏఐటీయూసీ నాయకుడు రామకృష్ణ, మరిడయ్య పిలుపునిచ్చారు. సభలను విజయవంతం చేయాలని కోరుతూ సివిల్ సప్లై గొడౌన్ వద్ద కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ ఏళ్ల తరబడి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించుకునేందుకు మహా సభలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నగరంలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఈ సభలు జరుగుతాయన్నారు. తొలుత ఆశీలమెట్ట నుంచి రామాటాకీస్ వరకు కార్మికులతో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కలాసీలు దమ్ము రాజు, నూకరాజు, శ్రీరాములు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులను దత్తత తీసుకున్న సిరి ఫౌండేషన్


చెక్కులు అందుకున్న విద్యార్థులతో సిరి ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులను ఉన్నత చదువులు చదివించేందుకు సిరి ఫౌండేషన్ సభ్యులు దత్తత తీసుకున్నారు. ఈ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన రాయిబోని శ్రీనివాస్, అనకాపల్లి విశ్వనాథ్, బందారు జాహ్నవిలకు రూ.10 వేల చొప్పున చెక్కులను గురువారం అందించారు. ఈ సందర్భంగా సిరి ఫౌండేషన్ ట్రస్టీ సూరెడ్డి బాబూరావు మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ద్వారా అనేక మంది పిల్లలను దత్తత తీసుకుని సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఎంతో మంది ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు చింతల శ్రీనివాసరావు, ఎల్వీ నారాయణరావు, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఆర్.నాగేంద్ర జోగి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే ప్రగతి


విద్యార్థులకు ప్రొగ్రస్ కార్డులు అందజేస్తున్న హెచ్‌ఎం పైడిరాజు

విశాఖ విద్య: జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పరిధిలో గల పాఠశాలల్లో గురువారం పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఫార్మేటివ్–1/ క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్ పరీక్షల్లో సబ్జెక్టుల వారీగా విద్యార్థుల సాధించిన మార్కులతో కూడిన ప్రోగ్రెస్ కార్డులను ఈ సందర్భంగా అందజేశారు. విద్యార్థులు చదువుల్లో ఎలా రాణిస్తున్నారనే విషయమై వారి తల్లిదండ్రులతో క్లాస్ టీచర్, సబ్జెక్టు టీచర్లు సమక్షంలో చర్చించాలని విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అడవివరం జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో హెచ్‌ఎం పైడిరాజు మాట్లాడుతూ విద్యార్థుల చదువుల విషయంలో తల్లిదండ్రుల భాగస్వామ్యం కూడా అవసరమన్నారు. పిల్లలు ఎలా చదువుతున్నారనేది తల్లిదండ్రులు గమనించాలని, ఈ విషయంలో ఎప్పుడైనా పాఠశాలకు వచ్చి సబ్జెక్టు టీచర్లతో మాట్లాడవచ్చన్నారు.

నులి పురుగుల నివారణ మాత్రలతో ఆరోగ్యం


పురుషోత్తపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న సిబ్బంది


విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎంపీపీ సూర్యకుమారి, జెడ్పీ వైస్ చైర్మన్ అప్పారావు

సింహాచలం: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పెందుర్తి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు అందజేశారు. మండలంలో 35,139 మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను అందించినట్టు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ స్వర్ణలత తెలిపారు. చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యం కోసం నులిపురుగుల నివారణ మాత్రలు వేయాలని సూచించారు.

సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

సబ్బవరం: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎంపీపీ బోకం సూర్యకుమారి గురువారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మండలంలో 1 నుంచి 19 సంవత్సరాల లోపు 15 వేల మంది పిల్లలకు ఈ మాత్రలు పంపిణీ చేసినట్టు సబ్బవరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొటాన రాము, ఎంపీడీవో రమేష్‌నాయుడు, ఎంఈవో వి.ఎస్.ఎస్.మూర్తి, పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ), ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎన్‌ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేయర్, జేసీబీ ఆపరేటర్ కోర్సుల్లో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగి, పదో తరగతి పాసై, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. రెండు నెలల పాటు శిక్షణ ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు పెదగంట్యాడలోని ఎన్‌ఏసీ శిక్షణ సంస్థలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 94903 91324, 83338 49420 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అంతర్జాతీయ క్రీడా పోటీల్లో సత్తా


ఎం.భాస్కరరావు



రాపాక రమేష్

పెదగంట్యాడ: సమైక్య భారతీయ ఖేల్ ఫౌండేషన్ (ఎస్‌బీకేఎఫ్) ఆధ్వర్యంలో దుబాయ్‌లో ఈ నెల 1 నుంచి 4 వరకు నిర్వహించిన అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పెదగంట్యాడకు చెందిన ఇద్దరు క్రీడాకారులు సత్తా చాటారు. స్టీల్‌ప్లాంట్ నీటి సరఫరా విభాగంలో పని చేస్తున్న ఎం.భాస్కరరావు 55 ప్లస్ విభాగంలో షాట్‌పుట్‌లో 5 కిలోల ఇనుపగుండును 10.10మీటర్లు విసిరి రజత పతకం, డిస్కస్‌త్రో లో 23.35 దూరం విసిరి రజత పతాకం కై వసం చేసుకున్నారు. పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించారు. పెదగంట్యాడ నెల్లిముక్కుకు చెందిన మరో క్రీడాకారుడు రాపాక రమేష్ యాదవ్ పవర్‌లిఫ్టింగ్ సీనియర్ విభాగంలో 515 కిలోల బరువు ఎత్తి బంగారు పతకం సాధించారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి గురువారం నగరానికి వచ్చిన వారిని పలువురు అభినందించారు.

సినీ సంగీత విభావరి రేపు

సీతమ్మధార: గీత్ సంగీత్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12న ఓసి మనసా.. నీకు తెలుసా.. శీర్షికను సినీ సంగత విభావరి నిర్వహించనున్నట్లు మాజీ ఏడీసీపీ, సంస్థ వ్యవస్థాపకుడు మహ్మద్ ఖాన్ తెలిపారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని సింధూర గెస్ట్ హౌస్‌లో గురువారం కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ తేదీ సాయంత్రం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సంగీత విభావరి జరుగుతుందన్నారు. ఉత్తరాంధ్రకు చెందిన గాయనీ, గాయకులు పలు గీతాలు ఆలపిస్తారని చెప్పారు.

మెయిన్ లైన్‌లో డీఆర్‌ఎం తనిఖీలు



రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్‌ఎం) సౌరభ్ ప్రసాద్ గురువారం డివిజన్ పరిధిలోని మెయిన్ లైన్‌లో గురువారం పర్యటించారు. విశాఖపట్నం–పలాస సెక్షన్ పరిధిలో పూండి నుంచి విశాఖ వరకు విండో ట్రయలింగ్ తనిఖీలు చేపట్టారు. ప్రయాణికుల భద్రత, సౌకర్యాలు, పరిశుభ్రత, నిర్వహణ అంశాలను పరిశీలించారు. విశాఖ రైల్వేస్టేషన్ నుంచి కొత్తవలస, చీపురుపల్లి, తిలారు, శ్రీకాకుళంరోడ్, నౌపడ వరకు ఈ తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా బ్రిడ్జిలు, లెవల్ క్రాసింగ్స్, మలుపుల్ని పరిశీలించారు. పర్యటనలో డీఆర్‌ఎంతో పాటు సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ జి.సునీల్‌కుమార్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి, సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజినీర్ ఎస్.కె.పాత్ర, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ ఎంఎస్ఎన్ మూర్తి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.